సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్

యూరియా కొరత.. రైతన్నల వెత!

- అరకొర సరఫరాతో ఇక్కట్లు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- ఎరువుల కోసం రైతుల యుద్ధం
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ఖరీఫ్ సీజన్‌లో రైతుకు యూరియా దెబ్బ గట్టిగానే తగిలింది. ఓ మూట ఎరువుకోసం కాళ్లరిగేలా వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, ప్రయివేటు ఫర్టిలైజర్స్ చుట్టూ తిరుగుతున్నా ఒక్కటంటే ఒక్క మూట యూరియాను దక్కించుకోలేక పోతున్నారు. రైతుకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయలేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. ఓ పక్క రూ.వేలు ఖర్చు పెట్టి దుక్కి చేసి, నారు నాటి, పంట ఏపుగా పెరిగే సమయంలో అవసరమైన యూరియా లభించకపోవడంతో వ్యవసాయ పొలాలు వదిలి అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ, ప్రయివేటు ఫర్టిలైజర్స్ చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో సుమారు 20 వేల మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ప్రస్తుతం 2 వేల ఎకరాల్లో వరి, వెయ్యి ఎకరాల్లో టమోటా, 500 ఎకరాల్లో వేరుశనగ, 300 ఎకరాల్లో కూరగాయలు, వంద ఎకరాల్లో గడ్డి తదితర పంటలను సాగు చేశారు. ఖరీఫ్ సీజనల్లో రమారమి 7,500 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో ఎకరానికి సుమారు 4 మూటల యూరియా అవసరం ఉంటుంది. ఆ లెక్కన సుమారు 30 వేల మూటలు యూరియా రైతులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. సగం ప్రయివేటు దుకాణదారులకు ప్రభుత్వం కేటాయిస్తే సగం ప్రభుత్వ వ్యవసాయ కార్యాలయాల ద్వారా అందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు అరకొరగా వస్తుండడం, ప్రయివేటు దుకాణాలకు మాత్రం అధిక సంఖ్యలో లోడ్ వస్తుండడంతో రైతులు అటు వైపు చూస్తున్నారు. కొంత మేర వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో ప్రయివేటు వ్యక్తులు యూరియా ను సరఫరా చేస్తున్నప్పటికీ ఎక్కువ సంఖ్యలో యూరియా ప్రయివేటు వ్యక్తులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. రైతు సకాలంలో యూరియా దొరకుతుందో లేదోనని కుంగిపోతున్నారు. ఒక్కో రైతుకు ఒక్క యూరియా మూట మాత్రమేనని నిబంధనలు అమలు చేస్తున్నా చాలామంది సన్న చిన్నకారు రైతులకు ఆ ఒక్కమూట యూరియా కూడా దొరకని పరిస్థితి. కొంతమంది దళారులు మాత్రం అధిక సంఖ్యలో యూరియాను కూడగట్టుకుని మూడో కంటికి తెలియకుండా విక్రయించుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ పక్క అధికారులు మాత్రం యూరియా కొరత లేదని, అపోహలకు వెళ్లొద్దని తెలియజేస్తున్నారు. అధికారులు చెప్పినట్లు యూరియా కొరత లేకపోతే రైతులు ఎందుకని అంతలా అవస్థలు పడుతున్నారో అధికారులే తేల్చాల్సి ఉంది. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత లేదని చెబుతున్న నాయకులు, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయన్నది వాస్తవ సత్యం.

మదనపల్లెలో సాగైన వరి పంట

యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

వారం నుంచి తిరుగుతున్నా

వారం రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా. ఒక మూట యూరియా కూడా దొరకలేదు. అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యవసాయం ఎలా చేయాలో తెలియడం లేదు.

- రాజగోపాల్, రైతు, వేంపల్లి.

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు

రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. ప్రయివేటుకు వచ్చే సరుకును బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బ్లాక్ మార్కెట్లో అధిక ధరకు విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు.

- సుధాకర్, రైతు, ఆవులవారిపల్లి.

రెండు ఎకరాల్లో వరి సాగు చేశా

రెండు ఎకరాలలో వరి సాగు చేశాను. పంట ఏపుగా పెరగాలంటే యూరియా వాడాలి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర యూరియా ఎవ్వరికీ చాలడం లేదు. నాలుగు మూట్ల యూరియా అవసరం ఉన్నా ఒక్క మూట దొరకలేదు. వచ్చిన సరుకును దళారులే మాయం చేస్తున్నారు. అసలైన రైతులకు మట్టే కొడుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు.

- వెంకటరమణ, రైతు, పసుపుమాకులపల్లి.

రైతులను దగా చేస్తున్న వ్యాపారులు

యూరియా కొరత ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. యూరియా కొరత గురించి మాట్లాడితే కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అగ్రికల్చర్ అధికారుల ఆధీనంలో కాకుండా ప్రయివేటు వ్యక్తులు యూరియాను విక్రయిస్తుండడంతో పరిస్థితి చేయిదాటుతోంది. రైతుకు అవసరమైన యూరియాను సరఫరా చేయకపోతే రైతులను కలుపుకుని ఆందోళన బాట పడతాం.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్.

అవసరమైన యూరియాను తెప్పిస్తాం

రైతులకు అవసరమైన యూరియాను తెప్పిస్తాం. వాడకం పెరిగింది. ఇప్పటి వరకు 510 టన్నులు తెప్పించాం. ఒక్కో రైతుకు ఒక్క మూట మాత్రమే ఇస్తున్నాం. ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటాం.

- నవీన్ కుమార్, వ్యవసాయ అధికారి, మదనపల్లె.

జిల్లా సమగ్రాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమం, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సూచించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండో రోజు మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సుకు ఆయన హాజరయ్యారు. జిల్లాకు అవసరమైన పలు అంశాలను ఈ సందర్భంగా సిఎం దృష్టికి కలెక్టర్ నిశాంత్‌కుమార్ తీసుకెళ్లారు. టమాటా, బొప్పాయి, మామిడి వంటి ఉద్యాన పంటలు, చిన్న తరహా నీటిపారుదల ట్యాంకుల పునరుద్ధరణ, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాల కేఫేల ఏర్పాటుపై దృష్టి సారించాలని సిఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తామని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు.

వెలుగు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న యానిమేటర్లు

సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

- విఒఎల ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

యానిమేటర్లు (విఒఎ) సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బ వరం రామాంజులు విమర్శించారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం వెలుగు కార్యాలయం ఎదుట విఒఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానిమేటర్ ఉద్యోగ కాల పరి మితిని మూడు సంవత్సరాలకు ఉద్దేశించిన 64 జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. యానిమేటర్లకు చెల్లించాల్సిన 8 నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస పద్ధతులను పాటించకుండా యానిమేటర్లను ఉద్యోగం నుండి తొలగిస్తుంటే సెర్ప్, డిఆర్‌డిఎ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారే పట్టించుకోవడం లేదని వాపోయారు. కొంతమంది అధికారులు సంఘ మిత్రలను వెంటనే రికార్డులు అప్పజెప్పాలంటూ బెదిరిస్తూ ఉండడం తగదన్నారు. యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కోశాధికారులు రాణి, సుబ్రహ్మణ్యం నేతలు రెడ్డప్పరెడ్డి కృష్ణమ్మ మాట్లాడుతూ తొలగింపులకు తమ ప్రభుత్వం వ్యతిరేకమని యానిమేటర్లను ఎవరిని తొలగించబోమని సిఎం చంద్రబాబు ఒకవైపు చెప్తుంటే, మరోవైపు కింది స్థాయి కూటమి నాయకులు అక్రమ తొలగింపులకు పాల్పడుతూ ప్రజల్లో వ్యతిరేకతకు కారణం అవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే చోటా మోటా నాయకుల ఆగడాలను అరికట్టకపోతే యానిమేటర్లు ఉద్యమించక తప్పదు అంటూ వారు హెచ్చరించారు. సెర్ప్, డిఆర్‌డిఎ నేతలు తమ దృష్టిని ఉద్యోగాల తొలగింపుపై కాకుండా పెండింగ్ జీతాల చెల్లింపుపై కేంద్రీకరించాలని కోరారు. యానిమెటర్లపై పని వారం తగ్గించడంతోపాటు 5జి మొబైల్ సిగ్నల్ ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రెండేళ్ల నుంచి స్త్రీ నిధి ఇంటెన్సివ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీడీ రాజేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, యానిమేటర్ల సంఘం నేతలు రమణారెడ్డి, రాజగోపాల్, నరసమ్మ, నాగమణి, పవన్, కృష్ణారెడ్డి, శంకరమ్మతో పాటు జిల్లాలోని యానిమేటర్లు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్ : పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని రాయచోటి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్ అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం క్లబ్ తరపున ఎన్నోసేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. పేదలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలంటూ ఆయన క్లబ్ సభ్యులను కోరారు. క్లబ్ అధ్యక్షులు పసుపులేటి మేఘశ్యామ్ మాట్లాడుతూ తన రెండవ కుమార్తె షణ్ముఖ ప్రియా జన్మదినాన్ని పురస్కరించుకుని పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. దాతల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామంటూ ఆయన తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ మహమ్మద్, ప్రభుత్వ వైద్యులు ఖదీర్ బాష, క్లబ్ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: రాయచోటి మున్సిపల్ పాలకవర్గం అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రవాణ, క్రీడ, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానం హాజరుకానున్నరన్నారు.పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో పాటు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మంగళవారం పింఛ ప్రాజెక్టు నుండి నీరు విడుదల చేసిన కారణంగా నదీ పరీవాహక ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ పీర్ మున్నీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువుల కాపరులు, గొర్రెల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు, సామాన్య ప్రజలు ఎవరూ కూడా నదీ తీరం దగ్గరకు వెళ్ళకూడదన్నారు. నది దాటే ప్రయత్నం చేయకూడదని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి రైతులకు వంద శాతం రాయితీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్పు పరికరాలపై వంద శాతం రాయితీ కల్పిస్తామని ఎపిఎంఐపి పీడీ లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. మంగళవారం పెనగలూరు మండల పరిధిలోని పొందలూరులో కెప్టెన్ పాలీప్లాస్ట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు డ్రిప్ పరికరాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతుల కోసం ప్రత్యేక దృష్టి సారించిందని, వ్యవసాయ రంగంలో ఎస్సీ, ఎస్టీ రైతులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు వంద శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను వినియోగించుకోవాలని తెలిపారు. సూక్ష్మ నీటి సాగుపైన రైతులకు అవగాహన కలిగి డ్రిప్పు పరికరాలతో వ్యవసాయంలో మరింత ప్రయోజనాలు పొందే విధంగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఐఎఒ వినోద్ కుమార్, కంపెనీ ప్రతినిధులు బాలకృష్ణ నాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బకాయిలను వెంటనే చెల్లించాలి

సర్పంచ్ హబీబ్‌కు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషకు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం వారు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ను కలసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 121 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా, ప్రస్తుతం 114 మంది పని చేస్తున్నారని. 46 మందికి రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. వీరికి సుమారు రూ.11 లక్షలు బకాయి వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.12,500 చొప్పున రెండు నెలలకు వేతనాలు అందాల్సి ఉందని తెలియజేశారు. ఈ విషయంపై డిపిఒకు కూడా ఫిర్యాదు చేశామని పేరిబ్కన్నారు. ఇందుకు సర్పంచ్ స్పందించి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ యూనియన్ నాయకులు డి.వెంకటరామయ్య. బి.వి.రమణ, ఓబులేసు, యల్లయ్య, పి.రెడ్డెప్ప, బానుప్రకాష్ పాల్గొన్నారు.

డీలర్లకు కొత్త ఇ-పాస్ డివైజస్ పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేయనున్న క్యూఆర్ కోడ్ రేషన్ కార్డుల వినియోగానికి సౌకర్యంగా చౌక దుకాణ డీలర్లకు కొత్త ఇ-పాస్ డివైజస్ పంపిణీ చేసినట్లు ఇ-పాస్ డివైజస్ జిల్లా సమన్వయకర్త బయ్యారెడ్డి తెలిపారు. మంగళవారం పీలేరు ఎంపిడిఒ కార్యాలయం సమావేశం మందిరంలో డివైజస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల పరిధిలోని చౌక దుకాణాల నిర్వాహకులు 258 మందికి విఎ-21 మోడల్ 4జి జియో నెట్‌వర్క్ ఇ-పాస్ డివైజస్ పంపిణీ చేశామన్నారు. పీలేరు మండలానికి 56, కలికిరి మండలానికి 34, కెవి పల్లి మండలానికి 52, కలకడ మండలానికి 32, వాల్మీకిపురానికి 45, గుర్రంకొండకు 39 డివైసెస్ కేటాయింపు జరిగిందని తెలియజేశారు. పాత ఇ-పాస్ మిషన్లలో 2జి నెట్‌వర్క్ సౌకర్యం మాత్రమే ఉండడంతో డీలర్లు నెట్‌వర్క్ సమస్యతో ఇబ్బందులు పడే వారని తెలిపారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఇ-పాస్ డివైజస్ లలో 4జి నెట్‌వర్క్, హాట్స్పాట్, వైఫై సౌకర్యాలతో పాటు ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేయనున్న క్యూఆర్ కోడ్ కార్డుల స్కానింగ్, స్వైపింగ్ సిస్టం కూడా అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లు విజయ్ కుమార్‌రెడ్డి, ఫజరుల్లా, రెవెన్యూ సిబ్బంది, చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

కురవంక అభివృద్ధికి సర్పంచ్ కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురవంక పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ పసుపులేటి చలపతి ఎంతో కృషి చేశారని వార్డు మెంబర్లు గొంగడి కృష్ణమూర్తి, నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కురవంక పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ పసుపులేటి చలపతి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. రూ.3 కోట్ల నిధులతో పంచాయతీలో మౌళిక సదుపాయాల కల్పించడంతోపాటు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారన్నారు. అభివృద్ధికి సొంత నిధులతో సైతం వెచ్చిస్తున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని 25 పంచాయతీలలో జరగని అభివృద్ధిని కురవంక పంచాయతీలో చేసి చూపించారన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు విడుదల చేయాలని అడిగితే, పంచాయతీలో ఏదో జరుగు తోందని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అదేవిధంగా బివైఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పునీత్ కార్మికుల పక్షాన నిలబడి వాస్తవాలు మాట్లాడితే అంత ఉలుకెందుకన్నారు. పంచాయితీలో గొడవలు రేపేందుకు పసుపులేటి వినోద్ కుమార్ ప్రయత్నిస్తున్నారన్నారు. విమర్శలు పక్కనపెట్టి కార్మికులకు పెండింగులో ఉన్న వేతనాలు చెల్లించాలని, తద్వారా పంచాయతీ అభివ ృద్ధికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో కురవంక పంచాయతీ వార్డు మెంబర్లు, బివైఎస్ పునీత్ పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-పీలేరు

హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీ మేధా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.లోకేష్ బాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన మరియు నియంత్రణ మండలి, అన్నమయ్య జిల్లా అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచనలు అనుసరించి ఇంటెన్సిఫైడ్ ఐఈసి క్యాంపెయిన్లో భాగంగా మంగళవారం పీలేరు శ్రీమేధ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్.లోకేష్ బాబు సహకారంతో విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ పై సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నాకో (ఎన్ఎసిం) నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో 8 వారాల పాటు "మీకు తెలుసా" కార్యక్రమాన్ని చేపట్టారు. క్యాంపెయిన్లో భాగంగా కోర సంస్థ ఉద్యోగి శైలజ మాట్లాడుతూ హెచ్ఐవిపై తయారు చేసిన 8 రకాల అంశాలపై ఎనిమిది వారాల పాటు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహనతో ఎక్కువ మంది హెచ్ఐవి రక్త పరీక్షలు చేసుకునేందుకు ముందుకు రావడం జరుగుతోందని తెలియజేశారు. హెచ్ఐవి బాధితుల పట్ల ఉన్న చిన్న చూపు, వివక్షను హెచ్ఐవి, ఎయిడ్స్ ఆక్ట్ 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం ద్వారా వారి వివక్షను తగ్గించి, వారి జీవిత కాలాన్ని పొడిగించవచ్చని తెలిపారు. అందరూ రక్త పరీక్షలు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీమేధ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, కోర్ ప్రతినిధి ఎస్.హసీన, శైలజ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టిన కోర్ సంస్థ సిబ్బంది

మాట్లాడుతున్న ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు లక్ష్మీప్రసాద్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి
టీ తాగుతూ చర్చించుకుందాం

- ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు లక్ష్మి ప్రసాద్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీ తాగుతూ చర్చించుకుందాం అని ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి.లక్ష్మీ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గత పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, అరియర్ గురించి పట్టించుకోలేదని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడిన ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ.25 వేల కోట్ల ప్రభుత్వం బకాయి ఉందని ఈ మొత్తాన్ని ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదన్నారు. ఉద్యోగ సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరం జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై వ్యతిరేకంతో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని, ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్దేశంతోనే సానుకూలంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గడచిన ఐదేళ్లల్లో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని వాపోయారు. ఈ విషయాలను ప్రభుత్వం గుర్తించి సత్వరం ఉద్యోగుల బకాయిల చెల్లింపుకు మార్గాన్ని ఆలోచించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు ఓ.సాయికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మునియ నాయక్, రామచంద్ర రెడ్డి,పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజా, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంజినీర్స్ డే ఉత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేటఅర్బన్ : అన్నమాచార్య యూనివర్సిటీలో సోమవారం నుంచి నిర్వహించిన ఇంజినీర్స్ డే ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఇంజినీర్స్ డే సందర్భంగా సిఇసి విభాగం ప్రాజెక్ట్ ఎక్స్‌పోను నిర్వహించింది. విద్యార్థులు సాంకేతిక ప్రతిభను ప్రదర్శిస్తూ అనేక వినూత్న ప్రోటోటైప్ మోడళ్లను రూపొందించారు. వీటిలో ఫైర్ డిటెక్షన్ అలారం సిస్టమ్, ఆటోమేటిక్ రైల్వే గేట్ కంట్రోల్ సిస్టమ్, బ్లూటూత్ ఆధారిత డోర్ లాకింగ్ సిస్టమ్, వైఫై మాడ్యూల్‌తో హోమ్ ఆటోమేషన్ మాడ్యూల్స్ ముఖ్యమైనవిగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా అన్నమాచార్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఇ.సాయి బాబారెడ్డి హాజరయ్యారు. సిఇసి విభాగాధిపతి డాక్టర్ జె.చిన్నబాబు, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ సి.హెచ్.నాగరాజు, ఫ్యాకల్టీ సభ్యులు నాగ నర్సయ్య గౌడ్, రవి కిషోర్, శివయామిని, చంద్రహాస్ రెడ్డి, స్వప్న, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంకేతికంగా రూపొందించిన ప్రతి మోడల్‌ను వీక్షించి వారు చూపిన ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ సాయి బాబా రెడ్డి, విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసి, సమాజానికి ఉపయోగకరమైన ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు కూడా విద్యార్థులను అభినందిస్తూ, ఈ తరహా ప్రాజెక్టులు భవిష్యత్తులో దేశ అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

గ్రామాల్లో సాంకేతికతతో కూడిన సర్వే

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ లక్ష్మీపతి

ప్రజాశక్తి- కలకడ

గ్రామాలలో మెరుగైన సాంకేతిక తో కూడిన సర్వేని నిర్వహి స్తున్నట్లు జిల్లా డివిజనల్ డెవలప్మెంట్ అధికారి డాక్టర్ లక్ష్మీపతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో పంచా యతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లకు స్వామిత్వపై సమీక్ష సమావేశం నిర్వహించడం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేని నిష్పక్షపాతంగా నిర్వహించి, నూరు శాతం సర్వేను శనివారంలోగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని కోన పంచాయితీ కోన గ్రామంలో సాంకేతికత తో కూడిన సర్వేని నిర్వహించడం జరిగిందన్నారు. పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ కేంద్ర రంగ పథకం అయిన స్వామిత్వ డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి భూమి మ్యాప్ చేయడం ద్వారా ఆస్తి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య కార్డులు జారీ చేయడం ద్వారా గ్రామ గృహ యజమానులకు 'హక్కుల రికార్డు'ను అందిస్తుందన్నారు. మండలంలోని కదిరాయ చెరువు పంచాయితీలో ఇంటింటి తిరిగి చెత్తను సేకరించడం జరిగిందని తెలిపారు. ఎంపిడిఒ భాను ప్రసాద్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతంగా ఉన్నప్పుడే రోగాలకు దూరంగా ఉంటామని తెలియజేశారు.ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వల్ల మురికినీరు గుంటల్లో నీరు చేరి, అక్కడ దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలేందుకు అవకాశాలు ఉన్నాయని కాబట్టి ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించి ట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానుప్రసాద్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కమలనాథ, సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న, సచివాలయం సర్వేయర్లు, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసౌమ్యనాథస్వామి హుండీ ఆదాయం రూ.3.93 లక్షలు

ప్రజాశక్తి-నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి హుండిని మంగళవారం లెక్కించగా రూ.3,93,869లు వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని 30 రోజులకు సంబంధించి లెక్కించడం జరిగిందన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్ధన, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు నేమ్ బోర్డు వితరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తాను చదివిన పాఠశాలకు పూర్వ విద్యార్థి నేమ్ బోర్డు వితరణ చేసినట్లు ఎంఇఒ-2 నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తవళం జడ్‌పిహైస్కూల్, ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, ప్రస్తుతం పుంగనూరులో ఎంఇఒగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రెడ్డన్న శెట్టి పాఠశాలకు నేమ్ బోర్డును వితరణ అందించారని తెలిపారు. తాను చదివిన పాఠశాలను ఉన్నతీకరించడంతో, తన వంతు సహాయంగా పాఠశాలకు నేమ్ బోర్డు ను అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి విద్యార్థి కూడా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, వారు చదివిన పాఠశాలలకు ఎంతో కొంత తోడ్పాటున అందించాలని అన్నారు. నేమ్ బోర్డును వితరణ చేసిన రెడ్డన్న శెట్టి ని ఎంఇఒ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

రైల్వేకోడూరు ఎంపిడిఒగా నాగిరెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నూతన ఎంపి డిఒగా ఆర్.నాగిరెడ్డి బాధ్యతలు చేపట్టా రు. ఉమ్మడి కడప జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎఒగా పని చేస్తున్న నాగి రెడ్డి పదోన్నతిపై రైల్వే కోడూరు ఎంపి డిఒగా బదిలీ అయినట్లు ఆయన తెలి పారు. మంగళవారం స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో పూర్తి బాధ్య తలు చేపట్టారు. స్థానిక ఉపాధిహామీ చట్టం మండల ఎపిఒ మృత్యుం జయ రావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎంపిడిఒను ఘనం గా స్వాగతం పలికి దుశ్శా లువాతో ఘన ంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి మండల పరిషత్ అభి వృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఆయన తెలిపారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు

ప్రజాశక్తి-వీరబల్లి : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేసుకోవాలని పశు వైద్యాధికారి గణేష్ తెలపారు. మంగళవారం మండలానికి 6500 డోసుల గాలికుంటూ వ్యాధి టీకాలు సరఫరా ప్రభుత్వం చేయడం జరిగింది. ఈ టీకాల కార్యక్రమం ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు ప్రతి రోజూ రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలో వేయడం జరుగు తుంద న్నారు. మంగళవారం మండలంలోని గడికోట గ్రామం యడబల్లిలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేసినట్లు తెలిపారు. గాలి కుంటు వ్యాధి వలన పాడి రైతులు తీవ్రంగా నష్టపోతారని, పాడి రైతులు ప్రతి ఒక్కరూ టీకాలు వేసుకోవాలని సూచిం చారు. పాడి రైతులకు పశువుల గురిం చి సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అనసూయ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులకు సమా చారం ప్రోటోకాల్ పాటించాలని ఎంపిటిసిలు, సర్పంచులు కోరారు. సమా వేశానికి పలు శాఖల అధికారులు హాజరవకపోవడంపై ఎంపిడిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైనవారికి నోటీసులు ఇస్తామన్నారు. సర్పంచులు, ఎంపి టిసిలు తమ గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. గతంలో పలు కారణాల వల్ల మండల సర్వసభ్య సమావేశం ఆగిపోయిన నేపథ్యంలో మంగళవారం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తంబళ్లపల్లె, పెద్దమండ్యం ఎస్ఐలు ఉమ మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపిడిఒ థామస్‌రాజ్, తహశీల్దార్ శ్రీనివాసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నందలూరు

మండల పరిధిలోని మహాత్మ జ్యోతిభాపులే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల కళాశాలలో సివిక్స్ గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎ పొలిటికల్ సైన్స్ కానీ జనరల్ అడ్మినిస్ట్రేషన్ గాని ఉత్తీర్ణులై బి.ఎడ్ కలిగి ఉన్న మహిళా అభ్యర్థులు వారి సర్టిఫికెట్లు, రెజ్యూమ్‌లతో ఈనెల 17 నుంచి 20వ తేదీ లోగా లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.డెమో ద్వారా ఎంపిక జరుగుతుందని, ఈ పోస్టు కేవలం గెస్ట్ ప్రాతిపదికన తీసుకుంటారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదిం చాలని ఆమె కోరారు.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No. 594/2024 IN
I.A.No. 37/2019 IN O.S.No. 34/2013

బుధరపు హేమాన్వి మైనర్ అయినందువలన వారి గార్డియన్, తల్లి బుధరపు ప్రశాంత, భర్త ప్రశాంత్, డోర్ నెంబర్: 13/142/91-A, సంజయ్ నగర్, మల్కాజ్గిరి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. **...పిటిషనర్/వాది**

Vs

R11. పెండ్యాల హరి తండ్రి తెలియదు, విజయ సూపర్ మార్కెట్, మెయిన్ రోడ్, పుల్లంపేట టౌన్ మరియు మండలం అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్/ప్రతివాది No.11

పిటిషనర్, రెస్పాండెంట్ అయిన మీపై భాగ పరిష్కార నిమిత్తమై దావా దాఖలు చేసి మరియు పై పిటిషన్ నందు ప్రిలిమినరీ డిక్రీలో తప్పులు సరిచేయమని కోరుతూ గౌరవ రాజశ్రీ వారి కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం జరిగినది. కావున పై పిటిషన్ లో మీకు ఏమైనా ఆక్షేపణలు యెడల మీరు కానీ, మీ వకీల్ గారి ద్వారా గాని 24.9.2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైకోర్టు నందు హాజరై మనవి చేసుకోవలెను, లేనంతట మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//
పి. వల్లభ రావు
పిటీషనర్ పరం వకీలు
రాజంపేట.

మహారాజశ్రీ ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట

I.A.No : 214/2025 In
O.S.No : 129/2025

కందుల పెద్ద సుబ్బరాయుడు died to L.Rs. కందుల సుబ్రహ్మణ్యం మరియు ఇతరులు. **...పిటిషనర్స్/వాదులు**

V/s

R11. కందుల బాలచంద్ర, తండ్రి పెద్ద పరదేశీ,కందుల వారి పల్లి గ్రామం మరియు పోస్ట్, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా. **...Proposed L.Rs/రెస్పాండెంట్ నెం.11**

నోటీసు

పై దావా యందు ప్రతివాది నెం.4 అయిన కందుల పెద్ద పరదేశి మరణించడంతో వాది వారసులైన మిమ్ములను దావా యందు చేర్చుటకు పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల 23.09. 2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరై మనవి చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

//By order of the Court//
S. రవీంద్ర,
R. పెంచలయ్య,
న్యాయవాదులు,
రాజంపేట.

ఓజోన్ పొరను కాపాడుకోవడం అందరి బాధ్యత

పుల్లంపేట : ఓజోన్ పొర ఆకారంగా విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్‌టుబి యూనివర్సిటీలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అసోసియేట్ డీన్ ఆర్అండ్‌డీ డాక్టర్ పి.శివయ్య మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16న ఓజోన్ పొర పరిరక్షణ కోసం ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో జరుపుకుంటామని తెలిపారు.ప్రస్తుత కాలుష్యం, భూతాపం, అడవుల నష్టం వంటి కారణాలతో ఓజోన్ పొర క్రమంగా క్షీణిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యుని నుంచి వచ్చే అల్ట్రావయలెట్ కిరణాలను అడ్డుకోవడంలో ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని, ఇది లేకపోతే ప్రాణికోటి నాశనం అవుతుందని ఆయన స్పష్టం చేశారు.1987లోనే క్లోరో ఫ్లోరో కార్బన్లు, స్ప్రేలు, ఎరువులు, క్రిమిసంహారకాలు వంటి వాటి వాడకాన్ని తగ్గించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ, అమలు పూర్తిగా జరగకపోవడం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటూనే ఉందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఓజోన్ పరిరక్షణపై అవగాహన పెంచుకుని చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి రంజిత్ భాస్కరన్, ఫస్ట్ ఇయర్ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్ర మోహన్త, డాక్టర్ రష్మీ రాయ్, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని మండలం కొత్తపేట గ్రామంలో జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అలీ అక్బర్ అధ్యక్షతన, సైన్స్ ఉపాధ్యాయులు డి.వి.సుబ్బారెడ్డి, పి. ఇంద్రావతి ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఓజోన్ పొర లేకుంటే మానవాళికి మనుగడే లేదని దానిని పరిరక్షించే బాధ్యత మనందరి బాధ్యత అని తెలియజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు ఓజోన్ పొర ఏవిధంగా ఏర్పడిందో, ఓజోన్ పొరకు రంధ్రాలు పడటానికి కారణాలేంటో, మనం ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటే జరిగే నష్టాన్ని నివారించవచ్చో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ ఫార్ములా ఒ3 రూపంలో విద్యార్థులను కూర్చోబెట్టి స్లోగన్స్ చదివి, వారిచేత పలికించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లిఖార్జున, ప్రసాద రెడ్డి, హిందీ ప్రసాద్, వెంకటరత్నం, లక్ష్మణుడు, చంద్రశేఖర్, పీడీ సాయిరామ్, వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఓజోన్ పొర ప్రాముఖ్యత, దాని రక్షణ అవసరం, పర్యావరణ సమతౌల్యంలో దాని పాత్రపై విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం పెంచడం, వృక్షారోపణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి అంశాల పైన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ అనంతకృష్ణ విద్యార్థులకు బహుమ తులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిల్పి ఆనందాచారి, బోగా వెంకటసుబ్బయ్య, గొంటు ముక్కల వెంకటరమణ, మస్తాన్, గౌరీ, రమణమ్మ, జ్యోతి ప్రియ, శర్వాణి, గాయత్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రతిరోజూ గ్రామాలలో చెత్తను సేకరించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంపిడిఒ రమేష్‌బాబు తెలిపారు. డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి మంగళవారం బండ్లపై, తవళం, నిమ్మనపల్లె గ్రామాలలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు వారి పరిధిలోని గ్రామాలలో ఇంటింటా చెత్తను సేకరించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించి తడి పొడి చెత్తగా వేరుచేసి ఎరువులను తయారు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై, వ్యర్థ పదార్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డంపింగ్ యార్డులో చెత్త నుంచి ఎరువులను తయారు చేసి, వాటిని విక్రయించడం వలన ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. గ్రామాలలో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్య నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారి పరిధిలోని ప్రజలకు చెత్త సేకరణ పై తగిన సూచనలు చేయాలన్నారు. మురుగనీటి కాలువ గట్లపై గడ్డిని, చెత్త నిల్వలను వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యద ర్శులకు సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పారిశుధ్యం మెరుగు పడాలని, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

'సశక్త్ పరివార్ అభియాన్'తో మహిళలకు ఆరోగ్యం

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కావ్యగంధ

ప్రజాశక్తి-కలికిరి

మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు సద్విని యోగం చేసుకుందామని మేడికుర్తి వైద్యులు డాక్టర్ కావ్యగంధ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం లో అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్ పిలకు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ అమలు పై శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రెండు వారాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదట గుట్టపాలెం 17న, కలికిరి-4 లో 18 వ తేదీ, మునోళ్లపల్లిలో 19న గుండ్లూర్‌లో 20న, కలికిరి-3లో 22న, పత్తిగడలో 24న, చీకటిపల్లిలో 25న, పల్లవోలులో 26న, కలి కిరి-2లో 27న, మహల్‌లో 29న, అద్దవారిపల్లిలో 30న, కలికిరి-1లో అక్టోబర్ 1వ తేదీ ఆరోగ్య, వైద్య శిబిరాలు నిర్వహించబడతాయని చెప్పారు.ఈ కార్యక్రమాలతో మహిళల ఆరోగ్యం బలపడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని, తల్లి ఆరోగ్యంగా ఉంటే తన పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని, మహిళా శక్తి సమాజ శక్తికి పునాది అవుతుందని తెలిపారు. మహిళలు, కిశోర బాలి కలలో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స లు చేయడం, గర్భిణులకు పరీక్షించి సరైన పోషక ఆహారం ఆవశ్యకత గురించి, గర్భకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. మహిళలు కార్యక్రమంలో పాల్గొని వైద్యసేవలు పొందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శాంతకుమారి, పర్యవేక్షకులు సుధాకర్, గిరిజ పాల్గొన్నారు.ఆయుర్వేదిక్ డాక్టర్ విజయ చంద్రిక ఆధ్వర్యంలో ఐపిబిపి కేంద్రంలో సైనికులకు ఆయుర్వేద ఔషదంపైన అవగాహన కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. **నందలూరు :** స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం అవుతుందని మండల ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శరత్ కమల్ పేర్కొన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతి వరకు జరుగుతుందని పేర్కొన్నారు. 17 న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 18 నుంచి 2వ తేదీ వరకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు మీ సచివాలయం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను మీ సచివాలయంలో తారీకును అడిగి తెలుసుకోవాలన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శరత్‌కమల్ తెలిపారు.

డిజిటల్ బాధ్యతలో జాగ్రత్త వహించండి

ప్రజాశక్తి వీరబల్లి

విద్యార్థులు డిజిటల్ బాధ్యతలో జాగ్రత్త వహించాలని గ్లోబల్ ఫౌండేషన ఆఫ్ గుడ్ నైబర్స్ సంస్థ పీల్డ్ ఇంప్లమెంటరీ ఆఫీసర్ నాగేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్‌డికెఆర్ కాలేజీలో గ్లోబల్ ఫౌండేషన్ ఆఫ్ గుడ్ నైబర్స్ సంస్థ ఆధ్వర్యంలో క్లిక్ చేసే ముందు ఆలోచించండి డిజిటల్ బాధ్యత వహించండి అనే కార్యక్రమాన్ని నిర్వహించడం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ గీతాంజలి మాట్లాడుతూ ఈ రోజుల్లో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ క్రైమ్స్ , సోషియల్ మీడియా వలన యువత ఎలా చెడుమార్గాలో నడుస్తున్నారన్నారు. నాగేశ్వర్ మాట్లాడుతూ యువత చాలా ఎక్కువుగా సోషియల్ మీడియా ద్వారా చెడు మార్గం వైపు దృష్టి పెట్టి వారి భవిష్యత్ పాడుచేసుకొంటున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాలకు యువత ఆకర్షణకు గురవుతున్నారని పేర్కొన్నారు. మొబైల్‌ను మంచి కోసం, మన అవసరాల కోసం మాత్రమే వినియోగించాలి సూచిం చారు. రిసోర్స్ పర్సన్ అన్నమయ్య జిల్లా అడిషనల్ స్కిల్ డెవలప్ మెంట్ ఆఫీసర్ ఆరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సైట్ల గురించి వివరించారు. డిజిటల్ బాధ్యత వహించి అందరూ తగిన జాగ్రత్తలు పాటించి భవిష్యత్‌ను మంచిగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్ర మంలో సంస్థ కో-ఆర్డినేటర్ బాబు, టీచర్ వెంకటరమణ, చక్రి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ జివి.పల్లవి ఆధ్వర్యంలో మంగళవారం ఫాగింగ్, మలాథిన్ స్ప్రే చేయించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించారు. గత కొంతకాలంగా దోమల బెడద ఎక్కువ ఉండ టంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని నగర పంచాయతీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన కమిషనర్ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణ చర్యలను చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధులలో మున్సిపల్ సిబ్బంది ద్వారా దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని ఆర్ఐ.రెడ్డి మస్తాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబునాయక్ తెలిపారు. ప్రజలు దోమల బారిన పడకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మోడల్ స్కూల్లో ఆటల పోటీలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంఇఒలు త్యాగరాజు, నాగసు బ్బరాయుడు అన్నారు.ఎస్‌జిఎఫ్ మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ కలసి ప్రారంభించారు. అండర్-14, 17 విభాగాలలో రన్నింగ్, షార్ట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్ సహా ఆరు రకాల పోటీలను నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు పీడీ, పిఇటి ఆటలను పర్యవేక్షించారు.

12 సార్లు రక్తదానం చేసిన గంగిరెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట : తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారికి రక్తం అవసరం కాగా చిన్నారి తల్లిదండ్రులు యంగ్ ఇండియా సేవా ఫౌండేషనుని సంప్రదించారు. తిరుపతి చెందిన పోలీస్ సిబ్బంది గంగిరెడ్డి ఆ చిన్నారికి అవసరమైన రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉగాది రాజశేఖర్ మాట్లాడుతూ ఇప్పటిదాకా 12 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది బందోస్తు, ప్రజలకు న్యాయం చేయటంలోనే కాకుండా సేవ చేయడంలోనూ ముందుంటారని నిరూపించారని పేర్కొన్నారు. .గంగిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా హిందీ దినోత్సవం

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్ : మండల పరిధిలోని సిటిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా హిందీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు రమేష్, మహమ్మద్ బేగ్ విద్యార్థులకు వ్యాసరచన, కథలు, కవితల పోటీలు నిర్వహించి, నాటికలు ప్రదర్శింపజేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయల డ్రామా ఆకట్టుకుంది. పిల్లలు ప్రతి ఒక్కరూ జాతీయ భాష హిందీలో మాట్లాడే విధంగా ఉండాలని హిందీ ఉపాధ్యాయులు కోరారు. చివరగా హిందీ పాటలకు విద్యార్థులు చేసిన నృత్యం అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్ నాయక్, బాలకృష్ణ నాయుడు, భారతి, సుజాత, సురేంద్రప్ప, ప్రమీల, కృష్ణా నందం, గౌస్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ, నరేష్ పాల్గొన్నారు.

'వాహనమిత్ర'కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలకడ : వాహన మిత్రకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తు న్నట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. మండలంలో ఆటోలు టాక్సీలు కలిగిన ప్రతి ఒక్కరూ సొంత వాహనాలు కలిగి ఉన్నవారు వాహన మిత్రులకు అర్హులని పేర్కొన్నారు. బుధవారం నుంచి 19వ తేదీ వరకు గ్రామ వార్డు సచివాల యాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకానికి అర్హులైన వారికి ఏడాదికి ప్రభుత్వం నుంచి రూ.15వేలు అందిస్తుందని తెలిపారు. వాహ నదా రులు వాహనానికి సంబంధించిన ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ , ఇన్సురెన్స్ కాపీలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్‌కార్డు. ఆధార్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-కలికిరి : వాహన ధరలు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కలికిరి అప్‌గ్రేడ్ సిఐ అనిల్‌కుమార్ వాహనదారులకు సూచించారు. ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆటో డ్రైవర్లలకు రోడ్డు భద్రతా నియమాలు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలని, ట్రాఫిక్ నిబంధ నలను కచ్చితంగా పాటించాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయా ణీకులను తరలిస్తే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ భద్ర తకే ఈ చర్యలన్నీ చేపడుతున్నామని, రోడ్డు నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పునరుద్ఘాటించారు. ఎవరైనా నిబంధనను పాటించని యెడల క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు

తవళంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రజలు సైబర్ నేరాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం తవళం గ్రామంలో ఆయన పర్యటించి ప్రజలకు ఆన్ లైన్ మోసాలు, అపరిచిత వ్యక్తుల మోసాలపై, మహిళలు, రోడ్డు భద్రతలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి సెల్ ఫోన్ జీవితంలో భాగమైందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కటి సెల్ ఫోన్ ద్వారాతో జరుగుతుండడంతో ప్రజలు ఆన్ లైన్ లో జరిగే మోసాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకు కెవైసి అప్‌డేట్ చేయాలని, పిఎం కిసాన్ అర్హుల జాబితాలో మీ పేరు ఉందో లేదో చూడాలని కొన్ని సందేశాలు వాట్సాప్‌లో పంపడం జరుగుతుందన్నారు. మరికొన్ని సందర్భాలలో ఫోన్‌పేకు పొరపాటున డబ్బులు పంపించామని తిరిగి డబ్బులను పంపించాలని బ్యాంకు నుంచి అడుగుతున్నట్లుగా నమ్మ పలుకు తార న్నారు. ఇటువంటి సందేశాలను తెరిచి చూసిన, వీటికి స్పందించినా వెంటనే అప రిచిత వ్యక్తులు మీ బ్యాంకు అకౌంట్లో నుంచి డబ్బులను ఖాళీ చేస్తారని జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతున్నారని, బంగారు భవిష్యత్తును బెట్టింగులతో పాడు చేసుకోవద్దన్నారు. మహిళలు ఆపద సమయాలలో శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట పెట్టుకొని, రోడ్డు నియమాలను పాటించాలన్నారు. అసాంఘిక శక్తులపై ప్రజ లు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైల్వేకోడూరు :శిక్షపడిన ముద్దాయితో పోలీసులు

మహిళను మోసం చేసిన ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మహిళను మోసం చేసిన ముద్దాయికి జీవితఖైదుతో పాటు రూ.80 వేలు జరిమానా విధించినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు..నియోజకవర్గం లోని ఓబులవారిపల్లి మండలం రాళ్లచెరువుపల్లి కొత్తపల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల మహిళను పాపిరెడ్డిపల్లికి చెందిన దాంట్ల విజయ్ కుమార్ మోసం చేసి సహజీవనం చేశాడు. మహిళ 8 నెలల గర్భిణిగా ఉన్న సమయంలో పెద్దల సమక్షంలో సిద్దు లయ్యస్వామి దేవాలయం వద్ద వివాహం జరిగి నట్లు నమ్మించాడు. అప్పటికే విజయ్‌కుమార్‌కు భార్య ఉన్న విషయం బయటపడింది. తర్వాత మహిళ మెడలో ఉన్న తాళిబొట్టు, కాళ్ల మెట్టెలు బలవంతంగా లాక్కొని, కడుపులో ఉన్న బిడ్డను చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు ఓబుల వారిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేసి ముద్దాయిని అదుపులోకి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వపరాలను పరిశీలిం చిన జడ్జి ముద్దాయికి జీవిత ఖైదితో పాటు రూ.80వేలు జరిమానా విధించినట్లు సిఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.మహేష్ తెలిపారు.

పోక్సో కేసులో మరొకరికి మూడేళ్లు జైలుశిక్ష

రాయచోటి టౌన్ : జిల్లాలోని సంబేపల్లి మండలం నారాయణరెడ్డి పల్లి గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు జడపాల వెంకటరమణ కేసులో మంగళవారం వైఎస్ఆర్ జిల్లా ప్రధాన కోర్టు న్యాయమూర్తి యామిని మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేలు జరిమానా విధించారు. 2021 నవంబర్ 5వ తేదీ బాలిక తల్లి రాయచోటి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి ఆధారాలతో కోర్టుకు సమర్పించడంతో నిందితుడికి శిక్ష విధించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీసులు, ప్రాసిక్యూషన్ బృందం, కోర్టు సిబ్బందిని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ప్రత్యేకంగా ప్రశంసించారు. మహిళల భద్రత కోసం కఠిన చర్యలు తీసుకుంటామని వేగవంతమైన విచారణ జరిపి గుడ్ ట్రైల్ మానిటరింగ్ కొనసాగుతుందని తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : బైక్ లో నుంచి పడిన వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళ వారం పట్టణంలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని మేదరవీధికి చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంలో మార్పురీవీధిలో వెళ్తుండగా మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయప డడంతో గమనించిన స్థానికులు బాధితున్ని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమం గా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : డిగ్రీ చదువుతున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లె రూరల్ మండలంలో వెలుగు చూసింది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని శానిటోరియం సమీపంలోని కొత్తపేటకు చెందిన సందీప్, రుక్మిణి దంపతుల కుమారుడు (20) మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బిసిఎ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సుచిత్ చిన్నతనంలోనే తల్లి రుక్మిణి, భర్తను, బిడ్డను వదిలి వెళ్లిపోగా తండ్రి సైతం సుచిత్‌ను వదిలి వెళ్ళిపోయాడు. అప్పటినుంచి అవ్వ సుగుణమ్మ, మామ రమేష్‌ను సుచిత్ బాగోగులు చూసుకుంటూ, పోషిస్తూ చదివించుకున్నారు. ఈ నేపథ్యంలో ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ రాత్రి బాత్రూంలో సుచిత్ చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయాన్నే అవ్వ, మామ గమ నించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జింక అడ్డురావడంతో బోల్తా పడ్డ బైక్

- తల్లీకుమారుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పిటిఎం మండలం,టి.సదుం క్రాస్ వద్ద కర్ణాటక రాష్ట్రం ఆమడగూరు మండలం చెందిన రాధమ్మ తన కుమారుడు పవన్‌కుమార్ ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంలో ఉదయం సుమారు 9 గంటల సమయంలో వస్తూ ఉండగా జింక దూరడంతో ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఇద్దరికీ తీవ్రంగా రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిద్దరని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వారిని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జీపు ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/కలకడ : జీపు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం కలకడ మండలంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని కదిరాయచెరువు ఎస్టీ కాలనీకి చెందిన పెద్ద రెడ్డెప్ప భార్య జయమ్మ (64) ఇంటి వద్ద నుంచి మర్రిపాడురోడ్డులో నడుచుకుంటూ వ్యవ సాయ పొలానికి బయల్దేరింది. మార్గమధ్యంలోని బొంతల వారి పల్లె వద్ద ఆటో వేగంగా వచ్చిన బొలెరో పికప్ వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించే లోపే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.